

# వచ్చిపోయాను కాలం

మల్లాప్రగడ
రామారావు

పనసమొక్క తను నాటిందే. చెట్టయింది. కాయలు గుత్తులుగా వేలాడుతున్నాయి. ఇంటిచుట్టూ ఫెన్సింగ్ తనే కట్టించాడు. ఎంత డబ్బయిందో గుర్తులేదు. వెదురుబద్దలతో పెద్దవాడు కట్టిన ఆర్చిమీదుగా కాశీరత్నం తీగ అల్లుకుని ఉంది.

కృష్ణుడు పుట్టిన ఏడాదే తనకి క్వార్టర్స్ ఇచ్చారు. ఇరవై రెండేళ్ళ కాలం, తమా కష్టసుఖా లిక్కడే పంచుకున్నారు.

ఎన్నో జ్ఞాపకాలు. తలుచుకుంటే కన్నీళ్లా వస్తాయి, చిరునవ్వులా చిందుతాయి.

తాను కొకసారి టైఫాయిడ్ జ్వరం వచ్చి ఓ రాత్రి గాభరా చేస్తే అదురుతున్న గుండెలు చేతులతో పట్టుకుని, కన్నీళ్ళ బిగపట్టుకున్న కాంతాన్ని ఓదారుస్తూ రాత్రల్లా కూర్చోవడం...

తండ్రి పోయాడన్న టెలిగ్రామ్ అందుకుని సాయంకాలం రైలు వేళ వరకూ కలవరపడుతూ గడపడం...

తరవాత తల్లి ఇక్కడే చనిపోయింది.

తండ్రీ, తల్లీ ఒకరి తరవాత ఒకరు—చక్రంలా కాలం తిరిగిపోయింది.

ఇప్పుడు తను.

మూడేళ్లయింది సర్వీసులోంచి రిటైరయి.

తను రిటైరయ్యాడు. తన సమస్యలు రిటైరవలేదు.

ముప్ఫైనాలుగేళ్ల సర్వీసులో ఒక్క నిర్మల పెళ్లి చెయ్యగలిగాడు తను.

ఇల్లు కట్టుకోవాలని ఎంతో కోరికగా ఉండేది. కాంతానికి మరీని.

స్వంతాని కో చిన్న ఇల్లు. తనదీ అంటూ ఏమైనా సంతతికి మిగలాలని. కుదరలేదు. తనుచనిపోతే స్మృతే మిగులు తుంది— బాకీలూ, పిడికెడు బూడిదా తప్ప.

రిటైరవగానే క్వార్టర్సు ఖాళీ చెయ్యవలసి వచ్చింది. లేకపోతే పెన్షన్ మంజూరు కాదు.

ఎన్నో చిన్న కోరికలు. తీరనేలేదు.

ఇంక పిల్లలు పుట్టరనుకుంటూంటే కృష్ణుడు పుట్టాడు. తరవాత నిర్మల, రాము, కమల, సరోజ. ఆఖరివాడు చంద్రం.

చంద్రం చదువు ఇంకా ఉన్నత పాఠశాల స్థాయిలోనే ఉంది. సరోజని కాలేజీలో చేర్చలేదు. పి. యు. సి. చదువుతున్న కమలని చదువు మాన్పించి, ప్రావిడెంటు ఫండు డబ్బుతో పెళ్లిచేసి అత్తవారింటికి పంపడమైంది. రాము ప్రభుత్వంవారి లోన్‌తో పాలిటెక్నిక్ చదువుతున్నాడు. కృష్ణుడికి బి. కామ్. పూర్తయినా ఉద్యోగం దొరకలేదు.

పెన్షన్ డబ్బుతో సంసారం గడవాలి. గడవదు. గడుపుకోవాలి. నిండా జీతమందినప్పుడే బాకీలు, బాధలు. ఉత్త పెన్షన్ డబ్బు లేం సరిపోతాయి?

"పోర్టులోనే గుమాస్తా ఉద్యోగాలు ఖాళీ వచ్చాయి. నా కన్నా సీనియర్‌లు ఉన్నారట. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజి వాళ్ళు నా పేరు పంపడం లేదు" అన్నాడు కృష్ణుడు, ముఖం చిన్నబుచ్చుకుని.

కృష్ణుడికి ఉద్యోగమైతే బాగుండును.

సరోజకి ఎలా పెళ్లి చెయ్యగలడో భగవంతుడికే తెలియాలి.

చంద్రం చదువు.

క్లబ్ ఆవరణలో ఫుట్‌బాల్ ఆడుతున్నారు. పడుచుదనం.

ఫుట్‌బాల్ ఆటలో బంతిని కాలితో తన్నినట్టు ఎవరో జీవితాన్ని ఆటబంతిగా చేసి తన్నుతున్నారు.

నాలుగు అడుగులు వేస్తే అచ్యుతం ఇల్లు.

అచ్యుతరావూ, తనూ ఒక్క



ఫోటో—పి. ఎమ్. వరప్రసాదరావు (గుంటూరు)

కొండ దాపున

ప్రాణంగా మెలిగారు. ఎప్పుడూ మాటా మాటా అనుకోలేదని కాదు. అనుకున్నా, మరిచిపోయి మర్నాటికల్లా మనసులు విప్పి మాట్లాడుకునేవారు.

సీతమ్మ, కాంతంకూడా అక్క చెల్లెళ్లలా ఉండేవారు— 'వదినా!' అంటూ పిలుచుకున్నా.

అలాంటి అచ్యుతరావు చచ్చిపోయాడు. స్వంత తమ్ముడు చచ్చిపోయిన ట్టనిపించింది. సీతమ్మ ముఖం చూడలేక పోయాడు మొదట్లో.

తనకన్న అచ్యుతరావు అయిదేళ్లు చిన్న. ఇంకా రెండేళ్లలో రిటైరవుతాడనగా చనిపోయాడు. అప్పుడే రెండు నెలలు కావస్తూంది.

అచ్యుతరావు చనిపోయినా అనుబంధం పోలేదు. వారికి ఒకసారైనా టౌనుమంచి క్వార్టర్సుకి వచ్చి చిరంజీవినీ, పిల్లల్నీ, సీతమ్మనీ చూసి రావాల మంటుంది. అందుకే ఈ బయలుదేరడం.

పదిహేను రోజులై నిర్మల దగ్గరుండి విన్ననే తను వచ్చాడు.

చిరంజీవి కృష్ణుడికన్నా రెండేళ్లు చిన్న. బి. కామ్. చదువుతుండగా అచ్యుతం చనిపోయాడు. చదు వాగిపోయింది. ఏం తంటాలుపడుతున్నాడో, పసికుంక?

'మామయ్యొస్తున్నారు! మామయ్య!' చిన్నది లక్ష్మి గెంతులేస్తూ దగ్గరి కొచ్చింది.

సీతమ్మ— "రండి, అన్నయ్యా!" అంటూ గుమ్మంలో నిలబడి ఆహ్వానించింది.

ముఖంలో ఆనందం ద్యోతకమవుతూ ఉంది.

"ఏమిటమ్మా విశేషం? శుభవార్త ఏదన్నా ఉంటే తొందరగా చెవిని వేయ్!"

అదే పేముకుర్చీ. ఎన్నోసార్లు అచ్యుతం ఎదురుగా అందులో కూర్చుని మాట్లాడేవాడు. లాక్కుని కూర్చుంటూ అడిగాడు.

"విశేషమే నన్నయ్యా! చీకట్లో వెలుగురేఖ. చిరంజీవికి పోర్టులో ఉద్యోగమైంది. వారు పని చేస్తూ చేస్తూ చనిపోయారుకదా? అందుకని పిల్లడి పేరు 'ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌ఛెంజి నుంచి రాకపోయినా పరీక్షకి పిలవచ్చుట. వా డలా పరీక్ష క్కూచుని సెలక్టయ్యాడన్నయ్యా."

"సంతోషం, తల్లీ!"

కృష్ణుడు ఉద్యోగం. సరోజ పెళ్లి వాసు. చంద్రం చదువు బ్రతకడం. అద్దెకొంప.

"క్వార్టర్సుకూడా వీలైనంత త్వరలో ఇస్తారుట, అన్నయ్యా! కమిటీలో అదో రూలుందిట కదా?"

నిజమే. రూలు ఉంది.

ఉద్యోగం చేస్తూ మరణించిన

**చావంటే భయపడని వాడు ఉండడు. బ్రతుకు మీద మోజుని పెంచుకొని, జీవితం చుట్టూ పెంచుకొన్న బాధ్యతలు బ్రతుకుని నిలదీసి భవిష్యత్తుని ప్రశ్నించి తీరని సమస్యలు చక్రబంధంగా చుట్టూ అల్లుకొన్నప్పుడు మృత్యువును ఆహ్వానించడానికి వెనుదీయక పోవడం మనిషి ఆవేదనకు ఆఖరి దశా?**

ఉద్యోగి కుటుంబానికి వేరే ఆధారం లేకపోతే అతని పిల్లలనో, ఆ కుటుంబ బాధ్యత వహించిన దగ్గర బంధువునో ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌ఛేంజితో సంబంధం లేకుండా సెలక్షన్‌కి పిలవచ్చు. ఆ పిల్లడికి ఉద్యోగమైతే క్వార్టర్సు వేరే కేటాయిస్తారు.

"చల్లని కబురు చెప్పావు, తల్లీ!"

అవీ, ఇవీ మాట్లాడి టౌనుకు బయలు దేరేవేళకి సంజ వాలుతున్నది.

ఉద్యోగం చేస్తూ తనుకూడా చచ్చిపోయి ఉంటే. . .

ఈపాటికి కృష్ణుడికి ఉద్యోగమై ఉండేది. క్వార్టర్సూను. వాడికి పెళ్ళై ఆ డబ్బుతో సరోజపెళ్లికూడా జరిగి ఉండేది. వాసు, చంద్రంల చదువు, కుటుంబ పోషణ ఏదోలా జరిగి ఉండేవి.

అచ్యుతం అదృష్టవంతుడు బ్రతికి ఉండి తనలా కుటుంబానికి అన్యాయం చెయ్యలేదు.

ఈ దేశంలో బ్రతికి సాధించలేని పనులు కొన్ని కొన్ని చోట్లైనా చచ్చి సాధించే వీలుంది.

'చచ్చిపోయానుకాను!' *